# నైజం

## పిన్నకోట సుశీలాదేవి

ఉదయం ఏడు గంటల సమయం!

కాఫీ త్రాగి- పేపరు చదువుకుంటున్నాను!

"అయ్యగారూ", అన్న పిలుపు విని- తలెత్తి చూశాను!

ఎదురుగా సింహాచలం!

చేతులు నులుముకుంటూ దీనంగా నా వేపు చూస్తున్నాడు! అతన్నా స్థితిలో చూడగానే- అతడు నా దగ్గరకెందుకు వచ్చాడో అర్థమైపోయింది. అయినా- ఏం తెలీనట్లు-

"ఏమిటి సింహాచలం...." అనడిగాను!

అతడు మరింత దిగులుగా ముఖం పెట్టాడు!

"మా అమ్మాయి ఒంట్లో బాగా లేదయ్యా! హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి. చేతిలో పైసా లేదు. మీరొక పాతిక సర్దితే జీతాలు రాగానే ఇచ్చేస్తాను". అన్నాడు!

మరొకప్పుడైతే ఆ మాటలకు కరిగిపోయి నా జేబులో వున్నదంతా అతని చేతిలో పెట్టేవాడిని!. కానీ ఈ రోజు నా మనస్సుని కఠినంగా చేసుకున్నాను.

సింహాచలం మా ఆఫీసులో ప్యూను. త్రాగనిదే వుండలేడు.

ఆ త్రాగుడు కోసం అందరి దగ్గరా అప్పులు చేస్తుంటాడు! అందులో ఏ కొద్ది మొత్తమో తిరిగి ఇస్తాడు. అతడికి ఇంకెప్పుడూ అప్పు ఇవ్వకూడదని అనుకున్న వాళ్ళు కూడా అతని మాటలకు కరిగిపోయి అప్పులిచ్చేస్తారు!

అందరి దగ్గరకూ వెళ్ళి- దీనంగా- "బాబూ! నా భార్యకు ప్రాణం మీదికి వచ్చిందనో... నా కొడుకు స్పృహ లేకుండా పడుకున్నాడనో" అబద్ధం చెప్తాడు!

వినేవాళ్ళు- నిజంగా అతడు ఇబ్బందుల్లో వున్నాడేమో అనుకుంటారు! వెంటనే అతనికి తమ దగ్గర వున్నదంతా ఇచ్చేస్తారు! అతడా డబ్బుని తీసుకెళ్ళి సారా కొట్టుకు సమర్పిస్తాడు!

ఆ తర్వాత- ఆ విషయం తెలుసుకుని, అతనికి అప్పిచ్చిన వాళ్ళు ఎంతో బాధపడేవాళ్ళు! మోసపోయామని విచారించేవాళ్ళు! ఇంకెప్పుడూ అతనికి అప్పు ఇవ్వకూడదని నిర్ణయించుకునేవారు! కానీ- అతడొచ్చి అడగ్గానే మళ్ళా కథ మామూలే!

నేను కూడా అతని మాటలు విని మోసపోయి.... ఎన్నోసార్లు అప్పిచ్చాను!

నాల్గు రోజుల క్రితం.

అతని భార్య మా ఆఫీసుకొచ్చి గోల పెట్టింది!

"అయ్యగారూ! మా ఆయనకీ మధ్య తాగుడు బాగా ఎక్కువైందండీ! మీరంతా చెప్పి... మానిపించడయ్యా! ఎక్కడ లేని డబ్బూ ఆ తాగుడికే చాలడంలేదు. ఇంట్లో జరగడం చాలా కష్టంగా వుంది! మీరు నా సంసారాన్ని కాపాడాలయ్యా". అంటూ వేడుకుంది.

ఆ క్షణమే మేమందరమూ 'ఇక ఎప్పుడూ సింహాచలానికి డబ్బు అప్పు ఇవ్వకూడదని" నిర్ణయించుకున్నాం!

"మనం అప్పు ఇవ్వడం వలనే అతడు మరింత ఎక్కువగా తిరుగుతున్నాడు! మనం ఇవ్వకపోతే తాగుడుకు డబ్బు దొరకదు! ఇక క్రమేపీ మానేస్తాడు! ఇక మనమెవ్వరం అతడు చెప్పే కట్టు కథలకు లొంగిపోయి అతనికి 'డబ్బు అప్పు ఇవ్వరాదు...." అని చెప్పాను!

అందరూ అంగీకరించారు!

ఇప్పుడు సింహాచలం డబ్బు అడగ్గానే అదంతా గుర్తుకొచ్చి మరింత కఠినంగా వ్యవహరించాను!

"సింహాచలం... నా దగ్గర డబ్బు లేదయ్యా" అన్నాను.

సింహాచలం తెల్లబోయాడు!

"అయ్యా! మీరు కూడా లేదంటున్నారా! అందరూ అదే మాట అన్నారు! ఇవాళ లేచి ఎవరి ముఖం చూశానో గానీ- దిగులుగా అన్నాడు! అయితే అందరి దగ్గరకూ వెళ్ళాడన్న మాట. ఫర్వాలేదు. అందరూ మాట మీద నిలబడ్డారు! ఇలా కొన్నాళ్ళు జరిగితే సింహాచలానికి బుద్ధి వస్తుంది...." అనుకున్నాను.

"బాబూ! కనీసం పదైనా ఇవ్వండి...." బ్రతిమిలాడాడు!

"ప్చ్! లేదు సింహాచలం.... వుంటే ఇవ్వనూ...."

"మా అమ్మాయికి బొత్తిగా బాగా లేదయ్యా!" విచారంగా అన్నాడు!

అది అబద్ధం..... ఈ మాట ఇదివరకెన్నోసార్లు చెప్పి డబ్బు పట్టుకు పోయాడు. ఈసారి మోసగింపబడకూడదు! కానీ పైకి- ఎంత కష్టం వచ్చింది సింహాచలం! కానీ నా దగ్గర ప్రస్తుతం డబ్బు లేదు.... ఏమనుకోకు....." అంటూ కుర్చీలో నుండి లేచాను.

ఇంకాస్సేపు వుంటే నా మనస్సెక్కడ కరిగిపోతుందోనని భయపడి... గబగబా లోపలికొచ్చాను!

మా ఆవిడ కల్పించుకుని "అదేమిటండీ.... అతనితో అలా అనేశారు! పాపం అతడెంత బాధపడుతూ వెడుతున్నాడో చూడండి.... ఆ డబ్బేదో ఇవ్వకపోయారూ" అంది.

"నీకు తెలీదులే.... అతన్ని బాగు చేయాలనే.... ఈ ప్లాన్"

"ఏమిటో మీ ప్లాన్లు నాకేం నచ్చలేదు" అందావిడ.

నేను నవ్వి వూరుకున్నాను.

ఆఫీసుకెళ్ళాక మా కొలీగ్స్‌తో సింహాచలం వచ్చి వెళ్ళిన విషయం చెప్పాను!

"మా దగ్గరికీ వచ్చాడు! మేమూ డబ్బివ్వలేదు." అన్నారంతా.

"ఇక సింహాచలం మారొచ్చు" అన్పించింది.

"ఇలాగే ఇక ముందు కూడా సింహాచలం మాటలకు లొంగిపోకుండా వుంటే క్రమంగా అతను త్రాగుడు మానేస్తాడు.... డబ్బివ్వకపోతే ఏం చేస్తాడిక... కాబట్టి మనం గట్టిగా నిలబడాలి...." అన్నాను!

అందరూ అంగీకరించారు.

సాయంత్రం ఇంటికి రాగానే మా ఆవిడ ఎప్పుడూ లేనిది గుమ్మంలో ఎదురు చూస్తూ నిలబడింది!

### అన్నీ నా కోసమే

పొలం మీ కోసమే
పంట మీ కోసమే
నీరు మీ కోసమే
గాలి మీ కోసమే
అడవి మీ కోసమే
కడలి మీ కోసమే!
మరివాడు
దోపిడీదారుడు
"మీ"ను దో చేసి
"నా"ను చేర్చాడు
అనుభవిస్తున్నాడు
అందలం ఎక్కాడు!

– అడిగోపుల వెంకటరత్నమ్

"ఏమిటో విశేషం?" నవ్వబోయాను!

ఆవిడ ముఖం మరింత సీరియస్‌గా పెట్టి "మీ ప్లాను ఫలితం ఏమయిందో చూశారా". అంది!

నేను తెల్లబోయాను!

"దేన్ని గూర్చి నువ్వు మాట్లాడేది?"

"మధ్యాహ్నం సింహాచలం కూతురు చచ్చిపోయింది. దానిక్కారణం మీరే! మీరు డబ్బిచ్చి వుంటే... ఆ పిల్ల బ్రతికేది కదా!" అంది.

ఆ మాట విని షాక్ తిన్నట్లయిపోయాను!

"నిజంగానా!"

"అవును.... కావాలంటే వెళ్ళి చూసి రండి...." అంటూ నన్నొక హంతకుడిలా చూసి లోపలకు వెళ్ళిపోయింది.

నా కాళ్ళూ చేతులూ చల్లబడిపోయాయి! నిలబడలేక- కూర్చుండిపోయాను.

"ఎంత ఘోరం జరిగింది! మా ఆవిడ అన్నట్లు మేం డబ్బిచ్చి వుంటే ఆ పిల్లకు సరైన వైద్యం జరిగి బ్రతికేది. ఆ పిల్ల చనిపోవడానికి కారణం మేమే! మేం ఆ పిల్లని హత్య చేశాం....."

నా కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి!

"పాపం ఆ పిల్లను దహనం చేయడానికయినా సింహాచలం దగ్గర డబ్బు వున్నదో! లేదో" అనుకుంటూ - మా అబ్బాయిని పిలిచాను.

'బాబూ! ఈ యాభై తీసుకెళ్ళి సింహాచలానికి ఇచ్చిరా! ఆ పిల్ల కర్మకాండకు ఖర్చు పెట్టమను" అని చెప్పాను!

వాడు వెళ్ళిపోయాడు!

చాలాసేపటి వరకూ అలా బాధపడుతూ కూర్చుండి పోయాను.

మరో గంట తర్వాత లేచి స్నానం చేసి వచ్చాను! కాఫీ త్రాగి- సింహాచలం ఇంటికి బయలుదేరాను!

"నేను చేసిన , పనికి.... అతనిని క్షమాపణ వేడుకోవాలి. అతనికింకేమైనా డబ్బు అవసరమైతే ఇవ్వాలి" అనుకున్నాను.

నేను వెళ్ళేసరికి సింహాచలం ఇంటి ముందు జనం వున్నారు. క్రింద పిల్లను పడుకోబెట్టారు. సింహాచలం భార్య గుండెలు బ్రద్దలయ్యేలా ఏడుస్తోంది. ఆ ఏడుపు చూడలేకపోయాను. దోషిలా సిగ్గుపడిపోయాను!

సింహాచలం ఆ గుంపులో కనబడలేదు!

అక్కడున్న వాళ్ళని అడిగాను ఎక్కడికెళ్ళాడో తెలీదన్నారు. బహుశ మిగతా ఏర్పాట్లు చూడడానికి వెళ్ళాడేమో.... అనుకుంటూ ఇక అక్కడ వుండలేక నెమ్మదిగా నడుస్తూ బజార్లోకి వచ్చాను.

కొద్ది దూరం వచ్చానో లేదో.... నా ఎదురుగా కనబడిన దృశ్యం చూసి ఆగిపోయాను.

"అక్కడ రోడ్డు ప్రక్కగా వున్న సారా కొట్లో కూర్చుని సింహాచలం మధ్య మధ్య బజ్జీలు తింటూ- చాలా తాపీగా గ్లాసుపై గ్లాసు పట్టిస్తున్నాడు"

ఆ స్థితిలో అతనిని చూడగానే కోపం- అసహ్యం.... కలగ్గా... విసురుగా వెనుదిరిగాను! ◻

